ప్రజాశక్తి
శుక్రవారం 12 మే 2023 8 పేజీలు
ప్రకాశం బాపట్ల





రోడ్డు ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు ఊరచెరువు లోని కొత్త కూరగాయాల మార్కెట్ వద్ద రోడ్డు ఆక్రమణ తొలగింపులో గురువారం ఉద్రిక్తత నెలకొంది. 110 అడుగుల కార్పొరేషన్ రోడ్డులో కొంత భాగాన్ని పలువురు వ్యక్తులు ఆక్రమించి ఇళ్లు కట్టారు. దీంతో తమ లెక్కల ప్రకారం 110 అడుగుల రోడ్డు విస్తరణ కోసం గతంలో కార్పొరేషన్ అధికారులు ప్రయత్నించగా ఏలూరి ప్రభావతి అనే మహిళ కోర్టును ఆశ్రయించారు. తమ ఆక్రమణలు తొలగించడానికి లేదని, ఆభూమిపై తమకు హక్కు కల్పించాలని కోర్టులో కేసు వేశారు. 110 అడుగుల రోడ్డు విస్తరణ కోసం స్థలం స్వాధీనం చేసుకోవాలని, ఆక్రమణదారులకు ప్రత్యామ్నాయ స్థలాలు కూడా ఇచ్చామని చెబుతూ కార్పొరేషన్ అధికారులు కూడా కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు తాజాగా కార్పొరేషన్‌కు అనుగునంగా తీర్పు ఇచ్చింది. రోడ్డు ఆక్రమణలు తొలగించి 110 అడుగుల రోడ్డు విస్తరణ చేయాలని సూచింది. దీంతో కార్పొరేషన్ అధికారులు గురువారం రోడ్డు ఆక్రమణలు తొలగించేందుకు ప్రయత్నించగా పలువురు వ్యక్తులు అడ్డుకున్నారు. కార్పొరేషన్ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. పోలీసుల సాయంతో అధికారులు రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్నారు. అయితే 110 అడుగులు మేర రోడ్డు విస్తరించాలా...?లేక 100 అడుగులుగా ఉంచి రోడ్డు ఆక్రమణలు తీసేయాలా..? అనే విషయంపై రాజకీయంగా అక్కడ హైడ్రామా నడుస్తున్నట్లు సమాచారం. ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ కె వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

చీరాల వైపు వలస నేతల చూపు..

- రోజు రోజుకూ పెరుగుతున్న ఆశావహులు
- టిడిపి టిక్కెట్ కోసం పోటీ
- పాలేటి పయన మెటో ..?



పాలేటి రామారావు



ఎంఎం.కొండయ్య

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో చీరాల నియోజక వర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. బలహీనవర్గాల వారు అత్యధిక సంఖ్యలో ఉన్న చీరాలలో ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాల నుంచి వలస నేతల రాక సర్వ సాధారణం. చీరాలలో టిడిపికి అభిమానులు, ఓటర్లు దండిగా ఉన్నారు. అయితే స్థానిక నాయకత్వ లోపం ఆ పార్టీని వెంటాడుతోంది. గతంలో చీరాల నుంచి టిడిపి అభ్యర్థులుగా డాక్టర్ సజ్జా చంద్రమౌళి, చిమటా సాంబు, డాక్టర్ పాలేటి రామారావు గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన ఆమంచి కృష్ణమోహన్ టిడిపికి మద్దతు ప్రకటించారు. అనంతరం వైసిపిలో చేరాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కరణం బలరావ ఎకృష్ణమూర్తి టిడిపి అభ్యర్థిగా గెలుపొందారు. అనంతరం వైసిపికి మద్దతు ప్రకటించారు. గతంలో టిడిపి తరుపున ఎమ్మెల్యేలుగా గెలుపొందిన చిమటా సాంబు,డాక్టర్ పాలేటి రామారావు ప్రస్తుతం వైసిపిలో ఉన్నారు. దీంతో స్థానికంగా టిడిపి నడిపించే నేత లేకుండా పోయాడు. యాదవ సామాజిక వర్గాని కి చెందిన ఎంఎం. కొండయ్యను టిడిపి ఇన్‌ఛార్జిగా నియమించారు. ఆయన అందుబాటులో ఉన్న పార్టీ నేతలు, కార్యకర్తలను కలుపుకుని కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ ఆశావహులు తమకు అనుకూలమైన నియోజకవర్గాలపై దృష్టి పెట్టారు.చీరాలలో చేనేతలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. ఆ సామాజిక వర్గానికి చెందిన వారు చీరాల టిడిపి టిక్కెట్ ▶ 2లో

రైతు సంఘాల నేతలపై పోలీసు నిర్బంధం

- సిఎం కార్యాలయ ముట్టడికి వెళ్లొద్దంటూ ముందస్తు నోటీసులు
- ఖండించిన వ్యవసాయ కార్మిక సంఘం



కంకణాల అంజనేయులుకు నోటీసు అందజేస్తున్న పోలీసు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలపై నిర్బంధం కొనసాగిస్తోంది. అకాల వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ ఈనెల 12న సిఎం క్యాంపు కార్యాలయ ముట్టడి రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలకు పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. ప్రజా ఉద్యమాలలో పాల్గొంటున్న రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలకు ముందస్తు నోటీసులు ఇవ్వటాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఖండించింది.

రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రైతులు పండించిన వివిధ పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతు సంఘాల నేతలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరుతూ వివిధ రూపాలలో ఆందోళనలు నిర్వహించారు. అయినా ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాక పోవటంతో ఈనెల 12న సిఎం కార్యాలయ ముట్టడికి రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. దీంతో గురువారం ఉదయం నుంచి జిల్లాలోని సుమారు 100 మంది రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలకు పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనవద్దని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉండటంతో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు కార్యక్రమంలో పాల్గొనవద్దని నోటీసులు జారీ చేశారు. ప్రజా ఉద్యమాలలో పాల్గొనవద్దని ప్రభుత్వం ముందస్తు నోటీసులు ఇవ్వటాన్ని వ్యవసాయ కార్మిక సంఘం ఖండించింది.

ముందస్తుగా నోటీసులు ఇవ్వటం దుర్మార్గం

వ్య.కా.స జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజా ఉద్యమాలలో పాల్గొనవద్దని రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులకు ప్రభుత్వం ముందస్తు నోటీసులు ఇవ్వటం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని వివిధ రూపాల్లో ఆందోళనలు చేసినట్లు తెలిపారు. ఈనెల 12న ముఖ్యమంత్రి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమానికి వామపక్షాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. అయితే పోలీసులు నిరసన కార్యక్రమానికి వెళ్ళొద్దని ముందస్తుగా పోలీసులు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు ఇవ్వడాన్ని ఆయన ఖండించారు. ఉద్యమాల్లో పాల్గొన వద్దని రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా నోటీసులు ఇవ్వడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని అరెస్టులు చేయాల్సి వస్తుందని హెచ్చరించటం వంటివి అప్రజాస్వామిక చర్యలని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు ప్రభుత్వాలు ▶ 2లో

వలసనేతల చూపు చీరాల వైపు...

(మొదటిపేజీ తరువాయి)

కోసం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. మంగళగిరి మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన చేనేత వర్గానికి చెందిన కాండ్రు శ్రీనివాసరావు చీరాల టిడిపి టిక్కెట్‌ను ఆశిస్తూ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. టిడిపి యువనేత లోకేష్ మంగళగిరి నుంచే రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో కాండ్రు వర్గీయులు లోకేష్‌కు మద్దతు తెలిపేలా, చీరాల టిక్కెట్ కాండ్రుకు ఇచ్చేలా హామీ ఇచ్చినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. ఇటీవల రామాపురంలో కాండ్రు శ్రీనివాస రావు విలేకర్ల సమావేశంలో పెట్టారు. అయితే ఎంఎం కొండయ్యను చీరాల టిడిపి అభ్యర్థిగా అధినేత చంద్రబాబు ప్రకటించారని, అందులో భాగంగా కొండయ్య నేతృత్వంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక నేతలు చెబుతున్నారు. కాండ్రు శ్రీనివాసరావు వైఖరిని కొండయ్య వర్గీయులు తప్పుపట్టారు. చీరాలలో టిడిపి తరపున ఎవరు కార్యక్రమాలు చేపట్టినా పార్టీ ఇన్‌ఛార్జి కొండయ్య నేతృత్వంలోనే జరపాలని విలేకర్ల సమావేశం పెట్టి మరి చెప్పారు. కాపు సామాజిక వర్గానికి చెందిన టిడిపి మాజీ ఇన్‌ఛార్జి యడం బాలాజీ కూడా తన అనుచరులతో కార్యక్రమాలు చేపడుతు తాను ఎన్నికల బరిలో ఉన్నట్లు తెలియ జేస్తున్నాడు. చీరాలకు చెందిన సజ్జా వెంకటేశ్వర్లు ఇటీవల చంద్రబాబు జన్మదిన వేడుకలను స్థానికంగా నిర్వహించారు. పేద ముస్లిం షేక్ ఆదాంబికి వ్యాపార నిమిత్తం తోపుడు బండిని ఇచ్చి, దేశాయిపేటలోని అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. సజ్జా కూడా లోకేష్ ద్వారా చీరాల దేశం టిక్కెట్ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు చెబుతున్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్‌ను కలుస్తున్న పలువురు ఆశావహులు, వారి అనుచరులు నేరుగా చీరాల వచ్చి ఫ్లెక్సీలు పెట్టి కార్యక్రమాలు చేపడుతున్నారు. చీరాలలోని ముఖ్య నేతలు అందరూ వైసిపిలో ఉన్నారు. కరణం, ఆమంచి వర్గీయులుగా విడిపోయి వారితోనే ఉన్నారు. టిడిపిలో నెలకొన్న ఈ గ్రూపుల పోరు స్థానిక పార్టీ క్యాడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది.

సొంతగా కార్యాలయం పెట్టిన పాలేటి

మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు చీరాల నియోజక వర్గం నుంచి రెండుసార్లు టిడిపి తరపున పోటీ చేసి గెలుపొందారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న మంత్రివర్గం లో కొంత కాలం పనిచేశారు. ఆ తరువాత మరో రెండుసార్లు దేశం తరపున, ప్రజా రాజ్యం పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయారు. 2014, 2019 ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. తాను పోటీలోని రెండు సార్లు దేశం అభ్యర్థులకు మద్దతు పలికారు. సాంకేతికంగా వైసిపిలో ఉన్నప్పటికీ స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో బుధవారం సొంత కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పార్టీలకు అతీతంగా తాను నిత్యం ప్రజలతో అందుబాటులో ఉండేందుకు కార్యాలయం పెట్టినట్లు పాలేటి చెబుతున్నారు. పాలేటితో సుదీర్ఘంగా ఉన్నవారు, అభిమానులు కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. మొదటి నుంచి టిడిపితో అనుబంధం ఉన్న పాలేటి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడమే ధ్యేయంగా పావులు కదుపుతున్నారు. పది సంవత్సరాలు చీరాల శాసన సభ్యుడిగా అనేక అభివృద్ధి పనులు చేసిన డాక్టర్ పాలేటి అనంతర కాలంలో కూడా చీరాల ప్రజలకు అంటుబాటులో ఉంటూవచ్చారు. పట్టణం వెలుపల నుంచి బైపాస్ రోడ్డు, దండుబాట, రైల్వే ఓవర్ బ్రిడ్జి, పంట పొలాలు మునగకుండా స్ట్రెయిట్‌కట్‌ల నిర్మాణాలు, రొంపేరు అభివృద్ధి పనులు, ఎత్తిపోతల పథకాల నిర్మాణం లాంటి ప్రజోపయోగమైన పనులు పాలేటి హయాంలో జరిగాయి. స్థానికత పాలేటికి కలసి వచ్చే అంశంగా ఉంది. ఎన్నికల్లో పోటీకి సిద్ధం అంటున్న పాలేటి రాజకీయ పయనం ఎటు వైపు అనేది ప్రశ్నార్థంగా మారింది.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-వేమూరు: వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త మన్నె సత్యనారాయణ కుటుంబాన్ని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు గురువారం పరామర్శించారు. ఇటీవల టిడిపి సీనియర్ కార్యకర్త అయిన మన్నే సత్యనారాయణ అనారోగ్యంతో మృతి చెందారు.. వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి మనో ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో జంపని గ్రామ పరిధిలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్టలో మాజీ మంత్రి



ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గ పరిధిలోని చిలుమూరు గ్రామంలో ఉభయ రామేశ్వర క్షేత్ర ప్రాంగణంలో నూతన వీరాంజనేయ స్వామి రాతిశిలా విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. గురువారం వేమూరు నియోజకవర్గం, కొల్లూరు మండల పరిధిలోని చిలుమూరులో విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పలు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చిలుమూరు గ్రామ టీడీపీ కార్యకర్తలు, వేమూరు, కొల్లూరు మండలాల టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి: డిఎస్‌పి

ప్రజాశక్తి-పొదిలి

ప్రజా సమస్యల పట్ల ఎప్పటికప్పుడు పోలీస్ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండాలని దర్శి డిఎస్‌పి అశోక్‌వర్ధన్‌రెడ్డి అన్నారు. నూతన డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన తరువాత మొదటిసారిగా ఆయన గురువారం పొదిలి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. మండలంలోని పలు సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

కంటి శస్త్ర చికిత్సల కోసం వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి-అద్దంకి

కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన 123 మందిని గుంటూరులోని శంకర్ నేత్రాలయానికి తరలించారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన వైద్య శిబిరంలో కంటి శుక్లాలు సమస్యలతో బాధపడుతున్న 170 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు నిర్ధారించారు. వారిలో 123 మందిని గుంటూరులోని శంకర్ నేత్రాలయానికి తరలించేందుకు నిర్ణయించారు. వారిని రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాల నుంచి పెదకాకాని శంకర కంటి వైద్యశాలకు రెండు బస్సుల ద్వారా తరలించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొని జెండా ఊపి వాహనాలను పెదకాకాని తరలించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి తమ్మిన శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు అద్దంకి లేవిప్రసాద్, జాగర్లమూడి శివకుమారి, నర్రా శ్రీలక్ష్మి, చందలూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇచ్చాకే సొసైటీని రద్దు చేయాలి

ప్రజాశక్తి-చిన్నగంజాం

మండలంలోని కోఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీకి చెందిన సభ్యులందరికీ వ్యక్తిగతంగా పట్టాలిచ్చిన తరువాత మాత్రమే సొసైటీని రద్దు చేయాలని ఆ సొసైటీ అధ్యక్షుడు బేతాళ యోహాన్ డిమాండ్ చేశారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో సొసైటీ రద్దు విషయమై మహాజన సభ జరిగింది. సొసైటీ లిక్విడేటర్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ నూతలపాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో రెండు నెలలలో సభ్యులందరికీ పట్టాలు ఇప్పించాలని తరువాతే సొసైటీని రద్దు చేయాలని సొసైటీ సభ్యులు ఎం బాబురావు, బి రుబేను, బి సామేలు, పి ప్రకాష్ కోరారు. సభకు 88 మంది కమిటీ సభ్యులు హాజరయ్యారు.

రైతు సంఘాల నేతలపై పోలీసు నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

సక్రమంగా అమలు చేయలేదని, ఆ చట్టాలు అమలు కోసం కూడా అనేక ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. రాజ్యాంగాన్ని పక్కన పెట్టి నిరంకుశ పాలన సాగించే పాలకులే శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. బెదిరింపులతో, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపాలనుకోవడం అవివేకమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇలాంటి అనాలోచిత చర్యలను మానుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పెద్దదోర్నాల:

అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి కార్యాలయం ముట్టడికి రైతు సంఘం పిలుపునిచ్చింది. అందులో భాగంగా ఎపి రైతు సంఘం డివిజన్ కార్యదర్శి దుగ్గెంపూడి తిరుపతిరెడ్డికి పోలీసులు నోటీసును జారీ చేశారు. జగన్మోహన్‌రెడ్డి కార్యాలయం ముట్టడికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గుర్తుతెలియని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మతిస్థిమితం లేని గుర్తు తెలియని సుమారు 30 సంవత్సరాలు వయసు కలిగిన వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన చెరుకుపల్లిలో గురువారం జరిగింది. చెరుకుపల్లి ఎస్ఐ డి వెంకట కొండారెడ్డి కథనం మేరకు గత రెండు రోజులుగా చెరుకుపల్లిలో మతిస్థిమితం లేని, ఇతర ప్రాంతానికి చెందిన వ్యక్తి చెరుకుపల్లిలో తిరుగుతుండగా, అన్నపానాదులు లేక గాని, మరియే ఇతర కారణమైన గాని మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. చెరుకుపల్లి విఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు స్థానికుడు అయి ఉండడని, తెలుగులో మాట్లాడడం లేదని, వేరే ప్రాంతానికి చెందిన వాడు అయి ఉండవచ్చునని ఆయన తెలిపారు.



ఘనంగా టిడిపి నాయకుడి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, చింతర్లలంక మాజీ సర్పంచ్ కోగంటి వెంకటేశ్వరరావు జన్మదినం వేడుకలు గురువారం చింతర్లంకలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి మరియు కొల్లూరు మండల మాజీ ఎంపిపి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్ ఆధ్వర్యంలో కొల్లూరు మండలంలోని వర్ధన్ మార్ట్ వద్ద కేకు కట్ చేయించి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మండల నాయకులు, కార్యకర్తలు, వర్ధన్ మార్ట్ సిబ్బంది పాల్గొని వెంకటేశ్వర రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి-వేమూరు

వేమూరు మండల పరిధిలోని బలిజేపల్లి సచివాలయాన్ని వేమూరు ఎంపిడిఓ, మండలాల ప్రత్యేక అధికారి సునీత గురువారం తనిఖీ చేశారు. బలిజేపల్లి సచివాలయం సిబ్బంది, వాలంటీర్లతో విడివిడిగా మాట్లాడారు. సంక్షేమ పథకాలు, రికార్డుల నిర్వహణ ఎలా ఉందో పరిశీలించారు.

ఓ గ్రూపుపై మరో గ్రూపు విచక్షణా రహిత దాడి

నలుగురికి తీవ్ర గాయాలు ● ఒకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఒకే పార్టీకి చెందిన రెండు గ్రూపుల మధ్య అధిపత్యపోరు కారణంగా ఒక గ్రూపుపై మరో గ్రూపు చేసిన దాడిలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డ ఘటన మార్టూరు సమీపంలోని జొన్నతాళి జాతీయ రహదారిపై సూర్య దాబా వద్ద బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, మార్టూరు సీఐ షేక్ థెరిసా ఫిరోజ్ కథనం ప్రకారం.. యద్దనపూడి మండలం పోలూరు గ్రామానికి చెందిన వేముల సాంబయ్య, నుల వినయ్, చింతపల్లిపాడు గ్రామానికి చెందిన గోరంట్ల సాంబయ్య యద్దనపూడి గ్రామానికి చెందిన, మీనుగ అంకినీడు మరికొంతమందితో కలిసి మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద సూర్య దాబా వద్ద భోజనం చేయడానికి హెూటల్‌లో కూర్చుని ఉన్నారు. ఈ క్రమంలో అక్కడ కూర్చుని ఉన్న వీరిపై యద్దనపూడి మండలానికే చెందిన మరో గ్రూపు వ్యక్తులు షుమారు 15 మంది కార్లలో వచ్చి విచక్షణాతరహితంగా కర్రలతో దాడి చేసి అక్కడి నుంచి పారిపోయారు. హెూటల్‌లో ఉన్న వ్యక్తులు పోలీసులకు సమాచారమిచ్చారు. కర్రల దాడిలో గాయపడిన నలుగురు వ్యక్తులను 108 వాహనం ద్వారా ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిలో తీవ్రంగా గాయపడిన వేముల సాంబయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కాగా గత వారం యద్దనపూడి మండలం పోలూరు గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఈ దాడి జరిగినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 13 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఫిరోజ్ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన వేముల సాంబయ్య, అంకినీడు, గోరంట్ల సాంబయ్య, వినయ్



విచారిస్తున్న బాపట్ల డిఎస్‌పి వెంకటేశులు

బాపట్ల డిఎస్పీ పరిశీలన

ఒకే పార్టీకి చెందిన రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరు కారణంగా జరిగిన దాడి నేపథ్యంలో నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటనలో బాపట్ల డిఎస్పీ టి వెంకటేశ్వర్లు గురువారం యద్దనపూడి, పోలూరు, ఘటన జరిగిన జొన్నతాళి దాబా వద్ద జరిగిన దాడిపై మార్టూరు సీఐ ఫిరోజ్‌తో కలిసి విచారణ జరిపారు. అర్ధరాత్రి వేళ జాతీయ రహదారిపై వీరంగం సృష్టించి నలుగురు వ్యక్తులను తీవ్రంగా గాయపరిచిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

నల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈ నెల 14వ తేదీన మండలంలోని కెవి పాలెం శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా నల్లూరి ఫౌండేషన్ అధినేత నల్లూరి వెంకట శేషయ్య దంపతుల ఆధ్వర్యంలో 600 పేద కుటుంబాల వారికి 600 బస్తాల బియ్యాన్ని పంపిణీ చేశారు. గురువారం కెవి పాలెంలోని నల్లూరి వెంకటసుబ్బయ్య నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బియ్యం పంపిణీని ఫౌండేషన్ ప్రతినిధి పాలడుగు వెంకట నారాయణ ప్రారంభించారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు పుట్టా బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రతి పండుగ సందర్భంగా, ప్రకృతి విపత్తు సందర్భాలలో కెవి పాలెంతో పాటు, చీమకుర్తి మండలం, జిల్లాలోని పలు ప్రాంతాలలో బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న నల్లూరి ఫౌండేషన్ అధినేత నల్లూరి వెంకట శేషయ్య సేవలు అభినందనీయమని అన్నారు. సిపిఎం నాయకులు బెజవాడ శ్రీనివాసరావు, పొత్తూరి సురేష్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధితో పాటు గ్రామాన్ని దత్తత తీసుకొని గ్రామ సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడుతున్న నల్లూరి వెంకట శేషయ్య అందరికీ ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 600 పేద కుటుంబాల వారికి 600 బస్తాల బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బక్క శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సోమినేని ప్రసాదు, మాజీ సర్పంచ్ ఆర్ కోటయ్య, వార్డు సభ్యులు గోరంట్ల ప్రసాదు, టిడిపి నాయకులు పుట్టా శ్రీనివాసరావు, బెజవాడ వెంకట్ నారాయణ, పమిడి సుబ్బారావు, వేమ చిన్న కోటేశ్వరరావు, బక్క ఏసురత్నం పాల్గొన్నారు.



బియ్యం పంపిణీ చేస్తున్న నల్లూరి ఫౌండేషన్ ప్రతినిధి పాలడుగు వెంకట నారాయణ

ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ఉపాధి పనులకు వెళ్లిన ఓ కూలీ మృతి చెందింది. ఈ ఘటన గురువారం జరిగింది. త్రిపురాంతకం పంచాయతీ పరిధిలోని చర్లపల్లి గ్రామానికి చెందిన పుచ్చకాయల సావిత్రి(37) ఉపాధి పని కోసం తోటి కూలీలతో కలిసి నడిచి వెళుతోంది. ఈ క్రమంలో సావిత్రి సొమ్మసిల్లి పడిపోయింది. తోటి కూలీలు ఆమెను పరిశీలించగా మృతి చెంది ఉంది. వారు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌కు, మృతురాలి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఎంపిడిఒ, ఏపిఓ, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు సావిత్రి మృతదేహాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వపరంగా అందే సహాయాన్ని త్వరగా వచ్చే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

మద్యం సీసాలతో పట్టుబడిన వ్యక్తికి శిక్ష

ప్రజాశక్తి-దర్శి: అనధికారంగా మద్యం విక్రయిస్తున్న కొత్తపల్లికి చెందిన గుర్రపుసాల పెద్ద నరసింహారావుకు కోర్టు 6 నెలల జైలుశిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధించినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టరు సుందరరామయ్య తెలిపారు. తేదీ. 07.09.2020న 180 ఎంఎల్ పరిమాణం ఉన్న 90 మద్యం బాటిళ్లు దొరకడంతో కోర్టు ఈ తీర్పు చెప్పినట్లు తెలిపారు.

13న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పంగులూరు: పంగులూరు మండల పరిధిలోని చందలూరు గ్రామ రైతు భరోసా కేంద్రం వద్ద ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు వారిచే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిర సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సాధారణ వ్యాధులకు, ఎముకలు, కీళ్ల వ్యాధులకు, గుండె సంబంధిత వ్యాధులకు, గ్యాస్ట్రబుల్ వ్యాధులకు పరీక్షించి మందులు కుడా ఉచితంగా ఇస్తామని తెలిపారు.

'బూచేపల్లి' ఆశయాలు కొనసాగిస్తాం

పేదలకు అన్నదానం, వస్త్ర దానం చేసిన కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-చీమకుర్తి

మాజీ ఎమ్మెల్యే దివంగత బూచేపల్లి సుబ్బారెడ్డి ఆశయాలు కొనసాగిస్తామని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక బూచేపల్లి కళ్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి నాలుగో వర్ధంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బూచేపల్లి ప్రజాసేవలో తరించారని, ప్రజల హృదయాలలో నిలిచారని, వారిని ఆదర్శంగా తీసుకొని తాము ముందుకెళుతున్నామని పేర్కొన్నారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ బూచేపల్లి సుబ్బారెడ్డి అందరికీ ఆదర్శప్రాయుడని, తమకు స్ఫూర్తి ప్రదాతని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలలో ఆయనకు ఆయనే సాటి అని, ఆయనను ఆదర్శంగా తీసుకొని పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక బూచేపల్లి కల్యాణ మండపం సెంటర్లోని బూచేపల్లి విగ్రహానికి, బస్టాండ్ సెంటర్లోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బూచేపల్లి కమలాకర్ రెడ్డి పార్కులోని బూచేపల్లి సుబ్బారెడ్డి స్మృతి పథంలో ఆయనకు కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. దర్శి నియోజకవర్గం, సంతనూతలపాడు నియోజక వర్గాల నుంచి భారీ సంఖ్యలో బూచేపల్లి అభిమానులు తరలివచ్చి నివాళులర్పించారు. అనంతరం ఐదువేల మందికి అన్నదానం నిర్వహించారు. 500 మంది పేదలకు చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ అంకులు, వైస్ చైర్మన్ బి వెంకట్‌రెడ్డి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు, మండల వైసిపి కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తప్పెట బాబురావు, సోమ శేషాద్రి, భీమన వెంకట్రావు, పత్తి కోటేశ్వరరావు, పి గంగయ్య, గోగినేని వెంకటేశ్వర్లు, మనం శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు కె శేఖర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, బూచేపల్లి నందిని, నర్రా ధనలక్ష్మి, చిన్నపరెడ్డి మస్తాన్‌రెడ్డి, చిన్నపరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



పేదలకు వస్త్ర దానం చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి



వైద్యశాలలో ఉన్న సుజిత్ మృతదేహం (ఇన్‌సెట్‌లో) సుజిత్

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి- జరుగుమల్లి (ప్రకాశం జిల్లా)

పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కామేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన బుడంగుంట్ల సుజిత్ కుమార్(15)కు ఇంగ్లీషులో 49 మార్కులు, సోషల్‌లో 42 మార్కులు, తెలుగులో 50 మార్కులు, హిందీలో 33 మార్కులు వచ్చాయి. గణితంలో 23 మార్కులు, సైన్స్‌లో 30 మార్కులు రావడంతో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన సుజిత్ కుమార్ తమ తల్లిదండ్రులు ఉపాధి హామీ పనులకు వెళ్లిన తరువాత ఎవరూ లేని సమయం చూసి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పనులు ముగించుకొని తండ్రి యోహాను, తల్లి అక్కమ్మ ఇంటికి వచ్చారు. సుజిత్ కుమార్ ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. వారు కేకలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి కొండపి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే సుజిత్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దొంగలకు గ్రామస్తుల దేహశుద్ధి

ప్రజాశక్తి-వేమూరు

చుండూరు మండలంలో పట్టపగలే దొంగతనానికి పాల్పడిన సంఘటన జరిగింది. చుండూరు మండలంలోని దిండిపాలెం గ్రామంలో గురువారం మధ్యాహ్నం పట్టపగలే దొంగలు ఓ ఇంట్లోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి బీరువాలో ఉన్న విలువైన వస్తువులను అపహరించే ప్రయత్నం చేశారు. ఈ విషయాన్ని కనిపెట్టిన ఇంటి యజమాని, గ్రామస్తులు దొంగల్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. గ్రామంలోని ఓ చెట్టుకు కట్టేసి తీవ్రంగా కొట్టారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తులు రేపల్లె మండలానికి చెందిన వారుగా గుర్తించారు. అనంతరం గ్రామస్తులు దొంగతనంకి పాల్పడిన వ్యక్తులను చుండూరు మండల పోలీసులకి అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదానం

ప్రజాశక్తి-చీమకుర్తి: ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్యర్యంలో రక్తదానం గురువారం జరిగింది. జవహర్ హాస్పిటల్‌లో వేరు వేరు గ్రామాలకు చెందిన మహిళలకు భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ద్వారా రక్తదానం చేయించారు. వీరిలో అంజమ్మ (రామిరెడ్డి పాలెం)అనే మహిళకి, అక్కమ్మ (చౌటపాలెం) అనే గర్భిణికి, రోజమ్మ (రావిపాడు) అనే మహిళకు రక్తం అవసరం కావడంతో రాజేష్, చిన్ని, శ్రీకాంత్ రక్తదానం చేశారు. ఇలాగే యువత అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జి దేవరాజు కోరారు.



వర్కర్స్‌తో టీ తాగుతున్న డిపిఒ

చెత్త సంపద కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి-మద్దిపాడు: చెత్త సంపద కేంద్రం ద్వారా పంచాయతీకి ఆర్థిక వనరులు సమాకుర్చుకోవచ్చునని డిపిఓ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని కేంద్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఆవరణలో మొక్క నాటారు. అనంతరం గ్రామస్తులతో కేంద్రం అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇఓపిఆర్‌డి సీహెచ్ సుబ్బారావు, గ్రామస్తులు బడే అంజిరెడ్డి, టీ కోటిరెడ్డి ఉన్నారు.

14న గంగవరంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-పంగులూరు / ఇంకొల్లు రూరల్

గంగవరం ప్రాంత ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో, ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే మెడికల్ క్యాంపు, ఈ నెల 14వ తేదీ ఆదివారం ఇంకొల్లు మండలం గంగవరం గ్రామంలోని, మంచాల వెంకటరామయ్య, రంగమ్మ మెమోరియల్ కళ్యాణ మండపంలో జరుగుతుందని మెడికల్ క్యాంపు కన్వీనర్ కే బాలచందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపు ఇంకొల్లు మండలం గంగవరంలో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. షుగరు, బిపి, ఉన్నవారు ఈ క్యాంపులోకి వచ్చి డాక్టర్‌తో చెకప్ చేయించుకుని, నెలకు వంద రూపాయలు చొప్పున రెండు నెలలకు సరిపడా మందులు 200 రూపాయలకే పొందవచ్చని అన్నారు. పేదల ఆరోగ్యం కాపాడేందుకు ఈ మెడికల్ క్యాంపు ఎంతగానో ఉపయోగపడుతుందని బాలచందర్ తెలిపారు. వైద్య రంగంలో మంచి అనుభవం గల డాక్టర్ అన్నవరపు సాంబయ్య, డాక్టర్ వి టైటస్, డాక్టర్ మంచాల రమేష్ కుమార్ వైద్య సహాయం అందిస్తారని తెలిపారు. మంచాల వెంకటరామయ్య, రంగమ్మ, మంచాల అనంతలక్ష్మి, స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహకారంతో, ఈ నెల మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపునకు వచ్చేముందు అవకాశం ఉన్నవారు ముందుగా రక్త పరీక్షలు చేయించుకొని రావాలని, లేకుంటే ఆదివారం ఉదయం 7 గంటల నుంచి క్యాంపు దగ్గర ఉచితంగా రక్త పరీక్షలు చేస్తామని బాలచందర్ తెలిపారు. ఈ క్యాంపును గంగవరం ప్రాంత గ్రామాల ప్రజలంతా ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ఉపాధి పనుల వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-కొల్లూరు

ఉపాధి పనుల్లో కూలీల సంరక్షణకు టెంట్లు ఏర్పాటు చేయాలని, వారికి పే స్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు కోరారు. గురువారం ఆయన కొల్లూరు మండల పరిధిలోని ఈపూరు, చిలుమూరు, అనంతవరం గ్రామాలలో పనిచేస్తున్నఉపాధి హామీ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస వేతనం 252 రూపాయలు ఇస్తున్నారన్న సాకుతో కూలీలను 10 గంటల నుంచి 12 గంటల వరకు పని ప్రదేశంలో ఉంచుతున్నారని, ఎండ తీవ్రత పెరగడం, టెంట్లు, మంచినీళ్ల సదుపాయం లేని ఏరియాలో పనులు చేయడం వలన కూలీలు చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కావున కూలీలను 10 గంటలకే ఇళ్లకు పంపించాలని ఆయన కోరారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వేమూరు

వేమూరులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున ప్రారంభించారు. వేమూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఈ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మెరుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రైతు పక్షపాతి అని, రైతులకు మేలు కలిగేలా ఎన్నో నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను విక్రయించి న్యాయమైన రేటుని పొంది దళారుల నుంచి తమను తాము రక్షించుకోవాలని అన్నారు. వేమూరు మండల, పరిసర ప్రాంతాల్లోని రైతులు తాము పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో వేమూరు మండలానికి సంబంధించిన వైసిపి నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొల్లి ముంత ఏడుకొండలు, కోగంటి లవకుమార్, ఇతర వైఎస్ఆర్ పార్టీ శ్రేణులు, నాయకులు అధికారులు, రైతులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ మంత్రి

ప్రజాశక్తి-వేమూరు: వేమూరు నియోజకవర్గ పరిధిలోని క్రాప గ్రామానికి చెందిన గోరికపూడి వెంకటేశ్వర్లు కుమారుని వివాహ వేడుకల్లో మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు పాల్గొన్నారు. గురువారం క్రాప గ్రామంలోని వారి స్వగృహంలో వివాహ వేడుక జరిగింది. ఈ వివాహ వేడుకలో మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

నేడు వేమూరు నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాశక్తి-వేమూరు: వేమూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం తెనాలిలోని చినరావురులో పార్టీ కార్యాలయంలో జరుగుతుందని నియోజకవర్గ టిడిపి కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఉపాధి హామీని పటిష్టంగా అమలు చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-కొత్తపట్నం

ఉపాధి హామీ పథకం అమలులో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులు కూలీలకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రాంతంలో ఆయన పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పుల ఫలితంగా తమకు తీవ్రమైన నష్టం జరుగుతోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. గతంలో గ్రూపుల వారీగా పని కొలతలు ఉండేదని, గ్రూపుల వారీగా మస్టర్ వేసుకునే వాళ్లని, దాని ఫలితంగా ఎంత పని చేస్తే అంత వేతనం వచ్చేదని కూలీలు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో పనిచేసిన అందరికీ కలిపి కొలత తీసుకోవడం, గ్రూపుల వారీగా పని కేటాయింపు కాకుండా వర్క్ ఐడి వారీగా కొలతలు తీసుకోవడంతో పనిచేసిన వాళ్లకు, చేయని వాళ్లకు తేడా కనిపించడం లేదని అన్నారు. గతంలో మస్టర్ షీట్లు తెలుగులోనే పేర్లు ఉండేవని, వాటిని ప్రస్తుతం ఇంటిపేరు లేకుండా వ్యక్తి పేరు ఇంగ్లీషులో ఇస్తున్నందున కూలీలు ఇంగ్లీషుని చదవలేక, ఇంటి పేరు లేనందున మస్టర్ ఎవరికి వేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తక్షణమే మస్టర్ షీట్లు తెలుగులో ఇవ్వాలని, గ్రూపుల వారీగా పని కొలతలు, వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో వేసవికాలంలో సమ్మర్ అలవెన్స్ ఇచ్చేవారని, మంచినీళ్లకు, పలుగు, పార, తట్టకు పారితోషికం ఉండేదని తెలిపారు. కూలీలను సమీకరించి కొలతలు తీసుకుని మస్టర్లు వేసి



కొత్తపట్నంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు

రకరకాల పనులు చేసినందుకు మేస్త్రీలకు పారితోషకం ఉండేదని, ప్రస్తుతం అవన్నీ రద్దు చేయడం అన్యాయమని అన్నారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసేందుకే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇటువంటి చర్యలు తీసుకుందని ఆయన విమర్శించారు. ప్రస్తుతం కనీస వేతనం రూ.272 కాగా రూ.200కు మించి రావట్లేదని, ఆ వేతనంతో ఎలా బ్రతకాలని ఆయన ప్రశ్నించారు. మూడు నాలుగు కిలోమీటర్ల దూరం నడిచి 40 డిగ్రీల ఎండలో పనిచేస్తున్న కూలీలకు అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం వైపు నుంచి నష్టపరిహారం అందించట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనేక పోరాటాల ఫలితంగా ఉపాధి హామీ చట్టం వచ్చిందని, ఇలాంటి సమస్యల మీద సంఘటితంగా ఉద్యమించటం ద్వారానే న్యాయం జరుగుతుందనిఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ మేస్త్రులు మిట్నసాల జయరావు, దర్శిగుంట మోహన్‌రావు, గేరా ఆంజనేయులు, మేడికొండ పొట్టియ్య, లకంతోటి కృపారావు, గండికోట వెంకయ్య, ధర్నాసి కృపారావు, ఎల్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుడి పింఛను తీసేశారు

గడప గడపకూ కార్యక్రమంలో కృష్ణ చైతన్యకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-పంగులూరు

మా అబ్బాయి పూర్తిగా వికలాంగుడు, మంచం మీద నుంచి లేవలేడు. ప్రభుత్వం వికలాంగుల కోటాలో రూ.5 వేల పింఛన్ ఇస్తుంటే, గ్రామంలో కొంతమంది కావాలనే ఆ పింఛన్ రాకుండా అడ్డుకున్నారని జాగర్లమూడివారిపాలెం దళిత కాలనీకి చెందిన వికలాంగుడు తెలగతోటి మహేంద్ర తల్లి శివ, నాయనమ్మ కాంతమ్మ వైసిపి అద్దంకి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్యకు ఫిర్యాదు చేశారు. మా అబ్బాయికి పింఛన్ వచ్చే విధంగా చేయాలని కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా, గురువారం సాయంత్రం వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య, మండలంలోని జాగర్లమూడివారి పాలెం దళితవాడకు వెళ్ళాడు. ఆ కాలనీలో 24 సంవత్సరాల వయసుగల తెలగతోటి మహేంద్ర అనే యువకుడు, అంగవైకల్యంతో ఏళ్ల తరబడి మంచంలోనే ఉంటున్నాడు. ఆ వ్యక్తిని కృష్ణ చైతన్య పలకరించారు. ఈ సందర్భంగా మహేంద్ర తల్లి శివ, నాయనమ్మ కాంతమ్మలు, మహేంద్ర పరిస్థితిని గురించి కృష్ణ చైతన్యకు వివరించారు. ప్రభుత్వం ఇచ్చే పింఛనే మహేంద్రకు ఆధారమని చెప్పారు. అలాంటి పింఛన్‌ను గ్రామంలోని కొంతమంది కావాలని పింఛన్ రాకుండా చేశారని, పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని కష్ణ చైతన్య కోరారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ, వచ్చే నెల నుంచి మహేంద్రకు రూ.5 వేల పింఛను వచ్చే విధంగా చర్యలు తీసుకుంటానని, అధికారులతో మాట్లాడి పింఛను ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాయిని ప్రమీల, మండల ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయని వెంకటసుబ్బారావు, స్థానిక వైసీపీ నాయకులు జాగర్లమూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుడికి పింఛన్ ఇప్పిస్తానని హామీ ఇస్తున్న కృష్ణ చైతన్య

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జెసికి వినపత్రం అందజేసిన నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకొని ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్రవర్మ గురువారం బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టరు చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో 4 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. చేతికొచ్చిన పంట అకాల వర్షాలతో నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజుల తరబడి కురిసిన భారీ వర్షాలతో కోస్తా, రాయలసీమ జిల్లాల్లో పంటలు నీటిలో నాని నష్ట తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని అన్నారు. వర్షాలకు పంట దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతుంటే పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోంద న్నారు. పంట నష్టాన్ని అంచనా వేయకుండా, ఉన్న పంటను కాపాడుకోవడానికి కనీసం టార్పాలిన్ పట్టలు కూడా ఇవ్వకుండా రైతుల్ని మరింత ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. వర్షాల ధాటికి ధాన్యంతో పాటు మిరప, మొక్కజొన్న, పసుపు, శనగ, వేరుశనగ, మామిడి, అరటి, ఇతర ఉద్యాన పంటలు బొప్పాయి, నిమ్మ, దానిమ్మ, బత్తాయి దెబ్బతిని రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారని అన్నారు. మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలని కోరారు. రాయితీపై విత్తనాలు అందజేసి రైతులను ఆదుకోవాలన్నారు. నాణ్యత కోల్పోయిన వివిధ పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతుకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం అందజేయాలన్నారు. పంట నష్టం అంచనా వేసి త్వరితగతిన పరిహారం అందించాలని కోరుతూ జెసికి వినతిపత్రం అందజేశామని నరేంద్రవర్మ తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రైతు నాయకులు, రాష్ట్ర నాయకులు, పార్లమెంట్ నాయకులు, బాపట్ల పట్టణ, మండల అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జెసి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నరేంద్ర వర్మ



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-దర్శి

క్రీడలలో గెలుపు. ఓటమిలు సహజమని గెలిచినవారికి అభినందనీయులని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. వైఎస్ఆర్-బిఎస్ఆర్ మెగా క్రికెట్ టోర్నమెంటు గురువారంతో ముగిసింది. విజేత అంజి పంతాస్ జట్టుగా మొదటి బహుమతి రూ. 1,00,000 జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అందజేశారు. ద్వితీయ బహుమతిగా సింహా లెవెన్స్ రూ. 60 వేల నగదును బాబు లెవెన్స్ జట్లు, తృతీయగా బహుమతి రూ. 40 వేలు, నాల్గవ బహుమతి గణేష్ వారియర్స్ జట్లు రూ. 20 వేలు అందుకుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు ఎస్ఎం. బాషా, మండల ఉపాధ్యక్షులు సోము దుర్గారెడ్డి, నాయకులు బాపిరెడ్డి, చింతలపూడి శ్రీనివాసరెడ్డి, కొల్లా భాస్కర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపు

ప్రజాశక్తి-కొండపి


పుస్తక పటనం చేస్తున్న విద్యార్థిని

పుస్తకాలు పఠిచడం ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని సంపాదించ వచ్చునని దాసిరెడ్డి పాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆంజనే యులు విద్యార్థులకు సూచించారు. కొండపి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన కార్యక్రమంలో విద్యార్థులు పుస్తకం చేశారు. ఈ సందర్భంగా ప్రధానో పాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల సమయంలో గ్రంథాలయంలోని పుస్తకాలు చదివి విజ్ఞానవంతులు కావాలని సూచించారు. ఈ సందర్భంగా 15 మంది విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు బి.కోటేశ్వరరావు, పాల్గొన్నారు. **మార్కాపురం :** స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. గురువారం కథలు చెప్పించడం, కథలు చదివించడం వంటి కారక్రమాలను చేపట్టారు. ఈ శిబిరంలో 21 మంది చిన్నారులు పాల్గొన్నారు. కథలతో చిన్నారుల్లో ఉత్తేజాన్ని నింపారు. వీటితో ఆసక్తి కలిగిన చిత్రలేఖనంలో మెళకువలను నేర్పించారు. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, వై.శిరీషలతో పాటు గ్రంథపాలకుడు జివి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎంపీ మాగుంట

సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండకు చెందిన మద్దెల సుధాకర్‌కు సిఎం సహాయం నిధి నుంచి రూ.55 వేల మంజూరయ్యాయి. బాధితుడికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి రూ.55 వేల చెక్కును గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు షేక్ నాసిర్ తదితరులు పాల్గొన్నారు.

102 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-కంభం రూరల్

మండల పరిధిలోని చిన్న కంభంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని సర్పంచి షేక్ రసూల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 102 మందికి బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ రామాంజనేయులు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ల్ ప్రభాకర్, నారాయణ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-సిఎస్.పురం


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు

మండల పరిధిలోని శీలంవారిపల్లి గ్రామానికి చెందిన నాయుడు రాధాకష్ణ కుమారుడు అజయ్, జ్యోతిక వివాహ వేడుకలు హైదరాబాద్ లోని యస్వియం గ్రాండ్ ఎలైట్ హాల్‌లో గురువారం జరిగాయి. ఈ వివాహ వేడుకలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే, కావలి నియోజకవర్గ పరిశీలకులు కదిరి బాబూరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కదిరి ప్రకాశ్‌రావు, కదిరి బాబూరావు విద్యాసంస్థల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ కదిరి పార్థసారథి, వరుకుంటపాడు మాజీ ఎంపిపి సుంకరి వెంకటాద్రి, కెవియన్‌యల్ కళాశాల చైర్మన్ ఇరగని చలపతిరావు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్‌పి

ప్రజాశక్తి-మర్రిపూడి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌పి మల్లిక గర్గ్

వార్షిక తనిఖీలో భాగంగా మర్రిపూడి పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి మల్లిక గర్గ్ గురువారం సందర్శి ంచారు. ఈ సంద ర్భంగా ఎస్‌పి పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ సంరక్షణ అందరూ బాధ్యత తీసుకోవాలిన తెలిపారు. అనంతరం పోలీసు స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌పి ప్రారంభించారు. మహిళా పోలీసులతో వారి పనితీరు మరియు విధివిధానాల పై చర్చించి సూచనలు, సలహాలు చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. నేరాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అంకమ్మరావు, ట్రైనింగ్ ఐపిఎస్ అంకిత సురానా, కనిగిరి డిఎస్‌పి ఆర్. రామరాజు, కొండపి సిఐ వై. పాండు రంగారావు, కొండపి, పొన్నలూరు ఎస్ఐలు వైవి.రమణయ్య, వి. రాజారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దారు

గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-టంగుటూరు

జగనన్న లే అవుట్లలో మౌళిక వసతులు కల్పించేందుకు ప్రతి శాఖకు చెందిన అధికారి కషి చేస్తున్నారని, ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులందరూ ముందుకు రావాలని అధికారులు భరోసా ఇచ్చారు. మండలంలోని జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గహ నిర్మాణ లబ్ధిదారులతో తహశీల్దార్ కొల్లిబోయిన సంజీవరావు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న లే అవుట్ లలో నివేశన స్థల పట్టాలు పొందిన లబ్ధిదారులందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా అధికారులందరూ పని చేస్తున్నారన్నారు. గ్రామంలోని జగనన్న లే అవుట్ లో గహ నిర్మాణ శాఖ ద్వారా 52 గహాలు నిర్మాణానికి మంజూరు కాగా వాటిలో 10 గహాలు నిర్మాణం పూర్తి కాగా మరో 25 గహాలు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉప్పుటూరి అరుణకుమారి, హౌసింగ్ ఎఇ పఠాన్ రియాజ్, సచివాలయం ఇంజినీరింగ్ సహాయకులు శరత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దుకాణాల కూల్చివేతపై పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి- కంభం రూరల్


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

కంభం బస్టాండ్‌లోని రెండు గదులను రాత్రికి రాత్రి ఓ వ్యక్తి రాజకీయ పలుకుబడితో కూల్చి వేశాడని జిలాని అనే వ్యక్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగమల్లేశ్వరరావు అక్రమంగా కూల్చివేసిన నిర్మాణాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ ఈ గదులను అబ్దుల్ ఖాదర్ జిలాని బియాబానికి ఆయన తండ్రి అబ్దుల్ రవుఫ్ బియబాని 2012లో రాసియిచ్చినట్లు తెలిపారు. వాటిని షక్ పజిల్, మస్రూద్ అనే అద్దెకు తీసుకొని హోటల్ నడుప ్రకుంటున్నారని తెలిపారు. అయితే అల్తాఫ్ అనే వ్యక్తి రాజకీయ పలుకుబడితో షట్టర్ల తాళాలను పగలగొట్టి గదులకు చెందిన స్లాబును కూల్చుతుండగా తాను సిఐ రాజేష్ కుమార్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆసయంలో తాత్కా లికంగా కూల్చివేత పనులను తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు తెలిపారు. తెల్లవారుజామున స్లాబు ను పూర్తిగా కూల్చివేసినట్లు జిలాని తెలిపాడు. ఈ ఘటనపై విచారించి బాధితులకు న్యాయం చేస్తానని ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు.

మాజీ ఉప సర్పంచి కృష్ణారెడ్డి మృతి

ప్రజాశక్తి-దర్శి

మండల పరిధిలోని పోతవరం గ్రామ మాజీ ఉపసర్పంచి మునగాల కృష్ణారెడ్డి(55) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణారెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రద్ధాంజలి ఘటించినవారిలో పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

సిపిఎం,రైతు సంఘం సంతాపం

మునగాల కృష్ణారెడ్డి మృతికి సిపిఎం డివిజన్ కార్యదర్శి తాండవ రంగారావు, రైతు సంఘం డివిజన్ నాయకులు సందు వెంకటేశ్వరరావు తెలిపారు. 2004లో ఎన్ఎస్‌పి సాగునీరు ఇవ్వాలని నిర్వహించిన పోరాటంలో మునగాల క్రిష్ణారెడ్డి 16 రోజుల పాటు నెల్లూరులో జైలుశిక్ష అనుభవించారని తెలిపారు. రైతుల కోసం పోరాడిన నాయకుడని వారు కొనియాడారు.


వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండల పరిధిలోని రేగులచెలుక గ్రామంలో మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకులు తులబందుల ఈశ్వరయ్య కుమారుడు పరబ్రహ్మం, స్వప్న వివాహ వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బి.వెంగయ్య, మాలకొండయ్య, పి.రవికుమార్, సర్పంచి బత్తుల కష్ణకుమారి, రమణయ్య, రామకష్ణంరాజు, దొర తిరుపతయ్య, వివిధ గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నారాయణకు ఎమ్మెల్యే స్వామి నివాళి


ప్రజాశక్తి-కొండపి


టిడిపి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే స్వామి

మండల పరిధిలోని పెద కండ్లగుంట గ్రామంలో కొల్లా నారాయణ దశదిన కర్మ గురు వారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పాల్గొన్నారు. తొలుత కొల్లా నారాయణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నంతరం గ్రామ పెద్దలు, టిడిపి నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి టి.వెంకటేశ్వర్లు, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-దర్శి



నివాళుర్పిస్తున్న వైసిపి నాయకులు

దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి నాల్గవ వర్థంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. శ్రద్ధాంజలి ఘటించినవారిలో రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టరు ఎస్ఎంజబాషా, మాజీ ఎంపిపిలు పోశం మధుసూధనరెడ్డి, ఇత్తడి దేవదానం, నాగార్జున్‌సాగర్ ప్రాజెక్ట్ కమిటి మాజీ ఉపాధ్యక్షులు సద్ది పుల్లారెడ్డి, నాయకులు గుజ్జుల యోగిరెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

పేదల సంక్షేమానికి కృషి : వరికూటి

ప్రజాశక్తి- మర్రిపూడి

పదేల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండలంలోని కాకర్ల గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చడం వైసిపి ప్రభుత్వానికే సాధ్యమని తెలిపారు. ఎప్పుడో బ్రిటీష్ హయాంలో జరిగిన



స్థానికులతో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

భూసర్వే మళ్లీ జగన్మోహన్‌రెడ్డి హయాంలో చేపట్టినట్లు తెలిపారు. శాశ్వత భూహక్కు పథకం క్రింద రీసర్వే చేయించి శాశ్విత భూహక్కు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో చిమట సొసైటీ మాజీ అధ్యక్షుడు మొల్లల శివరామిరెడ్డి, సర్పంచి మేళం శివన్నారాయణ, వైసిపి నాయకులు ఉస్తేలమూరి చెన్నారెడ్డి, బాలచెన్నారెడ్డి, బెల్లం వెంకటరెడ్డి, వీరెళ్ళ శ్రీను, కొండయ్య, చిమట వెంకటేశ్వర్లు, అల్లాటిపల్లి కొండారెడ్డి, దిండి నరసింహారావు, మొల్లల రామిరెడ్డి, మొల్లల వెంగళరెడ్డి, ఓగిరాల వెంకటేశ్వర్లు, నల్లగట్ల కాశయ్య, ఉలవపల్లి కిరణ్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని గంజివారిపల్లి గ్రామంలో సర్పంచి దుగ్గెంపూడి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రధాన వీధులలో బ్లీచింగ్ చల్లించారు. మురుగు కాలువల్లో డిడిటి, ఎబెట్ పిచికారి చేయించారు. ఈ సంధర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అపరిశుభ్రంగా ఉండటం వలన దోమలు పెరిగి రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా యర్రగొండపాలెం లోని శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగా మానసిక, శారీర, ఆరోగ్యానికి సోపానం లాంటిదని తెలిపారు. యోగాతో వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని చెప్పారు. యోగాసనాలు ఒత్తిడిని నియంత్రిస్తాయని చెప్పారు. అనంతరం గణితంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు నందగోపాల్, ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు పోలమ్మ, గ్రంథపాలకురాలు కటికల ఝాన్సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ప్రవేశపరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ రమణయ్య తెలిపారు.ఒసి, బిసి విద్యార్థులు 2011 సెప్టెంబరు నుంచి 31-08-2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్‌సి,ఎస్‌టి విద్యార్థులు 01-09-2009 నుంచి 31-08-2013 మధ్య జన్మించి ఉండాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2021-22 మరియు 2022-23 విద్యాసంవత్సరాల్లో చదివి 5వతరగతి పూర్తిచేసిన వారు దరఖాస్తు చేసుకొనేందుకు అర్హులని తెలిపారు. 11-06-23న ఉదయం 10oగలనుండి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులను మే 25 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. **మార్కాపురం :** మార్కాపురం పట్టణంలోని రాజ్యలక్ష్మినగర్‌లోని ఎపి గిరిజన సంక్షేమ గురుకుల (బాలికలు) పాఠశాలలో 3వ తరగతి నుంచి 6వ తరగతి వరకు ప్రవేశానికి ఆసక్తి గల విద్యార్థినులు దరరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కె.నాగమల్లేశ్వరి తెలిపారు. పాఠశాలలో ఖాళీగా 64 సీటు భర్తీకి అర్హులైన వారికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30లోపు నేరుగా గురుకుల పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. శ్రీశైలం ఐటిడిఎ ప్రాజెక్టు ఆఫీసర్ కార్యాలయంలో జూన్ 10న లాటరీ పద్ధతిలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మూడవ తరగతిలో అడ్మిషన్‌లు రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామన్నారు. నాల్గవ తరగతి, ఐదవ తరగతి, ఆరవ తరగతి వరకు గల సీట్లను కేవలం ఎస్‌సి విద్యార్థినులతో భర్తీ చేస్తామని తెలిపారు.



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల పరిధిలోని ఇమ్మడిచెరువు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసి సాయిబాబా ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే, టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, వైసిపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అవినీతిని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లాం : ఎంపిపి

ప్రజాశక్తి-మర్రిపూడి

ఉపాధి హామీ చట్టంలో పనుల్లో (ఎన్‌ఆర్ ఇజిఎస్)లో జరుగుతున్న అవినీతి గురించి తాను కలెక్టరు దృష్టికి తీసుకెళ్లినట్లు ఎంపిపి వాకా వెంకటరెడ్డి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మర్రిపూడి మండలంలో 11 వేల మందికి జాబ్ కార్డులు ఉన్నట్లు తెలిపారు. పనికి వెళ్లని వారికి హాజరు వేసేందుకు ఎఫ్ఎలు రూ. 200 నుంచి రూ. 250 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. మర్రిపూడి నుంచి పృథలగిరి క్రిందగా ఎస్‌టి.రాజుపాలెం వరకూ 10.8 కిలోమీటర్లు ఉన్న రోడ్డును రూ. 8.5 కోట్ల వ్యయంతో నిర్మించాలని అంచనాలు తయారు చేసి బుధ వారం ఒంగోలులో నిర్వహించిన దిశా మీటింగ్‌లో కమిటీ చైర్మన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డిని కోరినట్లు తెలిపారు. స్పందించిన మాగుంట త్వరగా పనులు పూర్తి వర్క్ ఆర్డర్ ఇవ్వాలని ఎస్ఇపిఆర్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. మర్రిపూడి-పొదిలి



మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరెడ్డి

రోడ్డులోనున్న రెండు కోనేరులు వద్ద ఏదైనా ప్రమాదం జరిగితే 30 అడుగులు లోయలో ప్రమాదం ఉందని, అందువల్ల ప్రాణహాని జరిగే అవకాశం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టరు స్పెషల్ గ్రాంటు ద్వారా కోనేరులను పూడ్పించి, పొదిలి-మర్రిపూడి రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమస్యలు పై స్పందించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఈ సందర్భంగా ఎంపిపి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి :సిపిఎం

ప్రజాశక్తి-కనిగిరి

అర్భాటాలు మాని ప్రజా సమస్యల పరిషా ్కరానికి అధికారులు,పాలకులు చర్యలు చేపట్టాలని సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి.కేశవరావు కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14,15 తేదీలలో కనిగిరి మున్సిపాలిటీలో ఇంటింటికీ సిపిఎం కార్యక్రమం నిర్వహంచనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందించాలన్నారు. ఇంటిపన్నులు తగ్గించాలని, చెత్తపన్ను తొలగించాలన్నారు. శివారు కాలనీల్లో మౌళిక వసతులు కల్పించాలన్నారు. రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. రూ.10లక్షలతో కాలనీలు కట్టించాలన్నారు. టిడ్కో ఇళ్ల లబ్దిదారులకు ఇవ్వాలన్నారు. ,ప్రభుత్వ భూముల్లో



మాట్లాడుతున్న పిసి కేశవరావు

అక్రమంగా వెంచర్లు వేయకుండా చూడాలన్నారు. ప్రజాసమస్యలపై సిపిఎం గత రెండు సంవత్సరాలుగా అనేక ఉద్య మాలు చేపడతున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాబోవు కాలంలో ప్రజల సమస్యలపై అనేక ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇంటింటికీ సిపిఎం కార్యక్రమం ద్వారా సిపిఎం శ్రేణులు ప్రతి ఇంటికి రానున్నట్లు తెలిపారు. ప్రజలు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో బషీరా,నరేంద్ర, ఏడుకొండలు, కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో లోపం రానీయవద్దు

టిడిపి శ్రేణులతో కొండపి ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

టిడిపి వ్యవస్థాపకులు మాజీ ముఖ్య మంత్రి స్వర్గీయ ఎన్‌టి.రామారావు 100వ జయంతిని పురస్కరించుకొని ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్స వాలను భారీగా నిర్వహిం చేందుకు టిడిపి నిర్ణ యించింది టంగు టూరులో శతజయంతి ఉత్సవాలకు ఏర్పాటు స్తున్న సభ వేదిక ఏర్పాటును ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి గురువారం పరిశీలించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 27 28 తేదీల్లో రాజమండ్రిలో టిడిపి మహానాడు జరగనుండగా ఆలోపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎన్‌టిఆర్ శతజయంతి నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో కొండపి నియోజకవర్గం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే స్వామి

స్థాయి సభను టంగుటూరులో ఒంగోలు రోడ్డులోని రావూరి వారి కంపెనీ ఆవరణలో నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు కామణి విజయకుమార్ కామని నాగ శ్రీను, తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు ఈదర ప్రభాకర్, రామా గోపి, బొజ్జా శ్రీనివాసులు, మక్కెన వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాజేస్తున్న

రెవెన్యూ అధికారులు

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

తర్లుపాడు మండలంలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులే కాజేస్తున్నారని మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వివరాలతో కూడిన అర్జీని సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలనా అధికారి హరిబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడు ఇలాఖాలో సర్వే నెంబర్ 43లో 110 ఎకరాల పశువుల మేత భూమిగా ఉందన్నారు. అందులో 50 ఎకరాలను కొండపోరంబోకుగా గతంలో నమోదు చేసినట్లు తెలిపారు. ఇటీవల ముగ్గురు తహశీల్దార్లు బదిలీ అయినట్లు తెలిపారు. ఈ భూమిలో మార్కాపురం వాసి 10 ఎకరాలు ఆక్రమించి సాగుకు యత్నించగా... గతంలో ఆర్‌డిఒ కాపాడినట్లు తెలిపారు. ఇటీవల వచ్చిన



పరిపాలన అధికారికి ఫిర్యాదు చేస్తున్న గాలి వెంకటరామిరెడ్డి

తహశీల్దారు ధనార్జనతో కొందరు రెవెన్యూ ఉద్యోగుల సహకారంతో సర్వే నెంబర్ 43లోని 50 ఎకరాలు ఆన్‌లైన్ చేసి పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేసినట్లు తెలిపారు. విఆర్‌ఒ, ఆర్‌ఐ, తహశీల్దారు ముగ్గురు ఎలాంటి ఆధారాలు లేకుండా, విచారణ లేకుండా పశువుల మేత భూములను అనర్హులకు కట్టబెట్టారన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్న నలుగురిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు.

వాస్తవాలు దాస్తున్న నాయకులు

కాట్రగుంట పశువుల బీడు ఆక్రమణలపై గ్రామస్తుల ఆవేదన • ఎఫ్ఎల్ఆర్‌లో పశువుల మేత అని ఉంటే వారసత్వం ఎలా అవుతుందని ప్రశ్న

ప్రజాశక్తి-పొదిలి

తమ పంచాయతీ పరిధిలోని ఆరు గ్రామాలలో పశువుల మేతకు కేటాయించిన పశువుల బీడు భూమి ఆక్రమణపై ప్రజా ప్రతినిధులు వాస్తవాలు మరుగున పడేలా మాట్లాడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని హరిత సమావేశ మందిరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ గ్రామాలకు చెందిన పశువుల బీడు (ఎద్దుల బీడు)లో సుమారు 60 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారుల అండదండలతో ఆన్‌లైన్ చేయించుకున్న విషయంపై తాము నాలుగు సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నామన్నారు. ఎఫ్ఎల్ఆర్ లో సదరు భూమి పశువుల మేత అని స్పష్టంగా ఉన్నా అది తమకు వారసత్వంగా వచ్చిందని కొందరు ఆక్రమణదారులు చెబుతున్నారని, వారికి రాజకీయ నాయకులు వత్తాసు పలుకుతున్న తీరు తమను ఆశ్చర్యానికి గురిచేస్తోందని వారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పంచాయతీ పరిధిలోని రెవిన్యూ పరిధిలోని సర్వే నెం 202లో ఎ.43-15సెంట్ల భూమిని ప్రస్తుత వెలుగొండ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్, గార్లదిన్నె మాజీ సర్పంచ్, వైసిపి సీనియర్ నాయకులు సానికొమ్ము తిరుపతిరెడ్డి తండ్రి వెలుగొండయ్య పేరుతో ఎ.14-38 సెంట్లు, కేసరి వెలుగొండారెడ్డి తండ్రి వెంకట కొండయ్య పేరుతో ఎ.14-38 సెంట్లు, కొమ్ములపాటి వెంకట తులసీ మాధవి భర్త వెంకట బంగారురావు పేరున ఎ.14-39 సెంట్లు ఆన్‌లైన్ చేసుకున్నారన్నారు. అదేవిధంగా సర్వే నెం:199లో ఎ4-16సెంట్లు, సర్వే నెం: 200/1లో ఎ.2-66 సెంట్లు, సర్వే నెం:200/2లో ఎ.5-24సెంట్ల భూమిని యేదుబాటి రమణమ్మ భర్త వెంకటరావు పేరుతో ఆన్‌లైన్ చేశారన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాట్రగుంట గ్రామస్తులు

ఈ మొత్తం భూములు ఎఫ్ఎల్ఆర్‌లో పశువుల మేత భూములుగా ఉన్న విషయం నాయకులకు, అధికారులకు తెలియంది కాదన్నారు. ఈ నెల 1వ తేదీన తాము మార్కాపురంలో కలెక్టర్ నిర్వహించిన ప్రత్యేక స్పందన కార్యక్రమానికి ఈ విషయంపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడ రెండు గంటలకు పైగా పోలీసులతో నిర్బంధించి అడ్డుకున్నారన్నారు. అది వారసత్వ భూమి అయితే పోలీసులను పెట్టి తమను నిర్బంధించాల్సిన అవసరం ఏముందన్నారు. ఈ విషయంపై రెండో తేదీన ప్రజల చేత ఎన్నుకోబడిన మండల ఎంపిపి, జడ్‌పిటిసి, వైసిపి కన్వీనర్‌లు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ ఆక్రమణపై ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి, మాజీ ఎమ్మెల్యే ఉడముల శ్రీనివాసరెడ్డికి ఎటువంటి సంబంధంలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. వారి ప్రమేయం లేకపోతే ఎఫ్ఎల్ఆర్‌లో పశువుల మేత భూమిగా ఉన్న ఆక్రమణకు గురైన భూమిని, 2015 నుంచి తాము పోరాటం చేస్తున్నా కనీసం ప్రజా ప్రతినిధులు ఒక్కసారైనా మద్దతు ఇచ్చారా అని ప్రశ్నించారు. 2015 తరువాత తహశీల్దారు కార్యాలయం ముందు గొర్రెలతో ఆందోళన చేస్తున్న సందర్భంగా మద్దతు తెలిపిన ప్రస్తుత అధికార పార్టీ నాయకులు (అప్పటి ప్రతిపక్షపార్టీ) అధికారం వచ్చిన తరువాత అయినా న్యాయం చేశారా అని నిలదీశారు. 2020 నుంచి కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ప్రతిసారీ అర్జీలు ఇస్తున్నా ఎందుకు పట్టించుకోలేదో అధికారులకే తెలియాలని అన్నారు. అధికారం వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డికి ఎన్నోసార్లు తమ సమస్యను వివరించామన్నారు. గతంలో తహశీల్దారుగా పని చేసిన డి భాగ్యలక్ష్మి ఈ భూమిని పరిశీలించి, విచారించి అది పశువుల బీడు భూమి అని ఆర్డీఓకు నివేదిక ఇచ్చారనే విషయాన్ని గ్రామస్తులు గుర్తు చేశారు. ఇటీవల గడప గడపకూ కార్యక్రమంలో గ్రామానికి వచ్చినప్పుడు పశువులకు మేత లేక ఇబ్బందులు పడుతున్నామని, ఆక్రమణదారుల నుంచి ఆ భూమిని విడిపించాలని విన్నవించామన్నారు. దాని విషయం తరువాత మాట్లాడుదామని ఆయన సమాధానం పరచడంలో ఆంతర్యం ఏమిటన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రజలను పక్కదారి పట్టించే విధంగా పశువుల మేత భూమి కాదని ప్రెస్ మీట్ పెట్టిన నాయకులు, వారితో అలా మాట్లాడించిన వారు శనివారం 13వ తేదీ మండలంలోని వెలుగొండ వేంకటేశ్వర స్వామి దేవస్థాన సన్నిధిలో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. దశల వారీగా దీక్షలు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రాజాల రామిరెడ్డి, గ్రామస్తులు పల్లాల కొండా రెడ్డి, మోరా వెంకటరెడ్డి, గొల్ల రామయ్య, కొలగాని వెంకట కొండయ్య, యరగొర్ల గురవయ్య పాల్గొన్నారు.

బాపట్ల డిఎస్‌పిగా వెంకటేశులు

ప్రజాశక్తి-బాపట్ల



బాపట్ల డిఎస్పీగా టి వెంకటేశులు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. 1995 బ్యాచ్‌లో అనంతపురంలో ఎస్ఐగా పోలీస్ శాఖలో చేరిన వెంకటేశ్వర్లురావు 2007లో సిఐడి సిఐగా పదోన్నతి పొందారు. 2007 నుంచి 2013 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో పనిచేశారు. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత రాష్ట్రంలో అనంతపురం, కడప జిల్లాల్లో సిఐగా పని చేశారు. 2020లో కర్నూలు రేంజ్‌లో కడప జిల్లా సిఐడి డిఎస్పీగా పదోన్నతి పొందారు. 2020 నుంచి ఇప్పటివరకు కర్నూలు రేంజి సిఐడి డిఎస్పీగా పని చేశారు. అనంతరం కర్నూలు రేంజి సిఐడి డిఎస్పీగా పనిచేస్తూ బదిలీపై బాపట్ల డిఎస్పీగా వచ్చారు. ఈ సందర్భంగా వెంకటేశులు మాట్లాడుతూ బాపట్ల పోలీస్ డివిజన్లో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. అదేవిధంగా గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. బాపట్ల డిఎస్పీగా పని చేసిన ఏ శ్రీనివాసరావు ఆత్మకూరు డిఎస్పీగా బదిలీపై వెళ్లారు.

చెరువు నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-కొత్తపట్నం: రాజుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాజుపాలెం గ్రామంలోని పికిలి మిట్ట అమృత సరోవర్ చెరువు నిర్మాణాన్ని ఎంపిడిఒ పి సుజాత, ఏపీవో రత్న జోష్న, ఈసీ చంద్రశేఖరరావు సందర్శించారు. ఎంపీడీవో మాట్లాడు తూ మండలంలో 2 గ్రామ పంచాయతీలు రాజుపాలెం, గాదెపాలెంలలో అమృత సరోవర్ నిర్మాణం చేపడుతున్నా మని, కొత్త అమృత సరోవర్ నిర్మాణం ఆలూరు గ్రామ పరిధిలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో త్వరలో ప్రారంభిస్తా మని తెలిపారు. రాజుపాలెం నిర్మాణానికి సంబంధించి ఒకటి న్నర ఎకరాలలో చెరువును నిర్మిస్తున్నామని, ఇప్పటివరకు నాలుగు వేల పని దినాలు పూర్తి చేశామని, ఏడు లక్షల వరకు కూలీలకు వేతనాలు అందినట్లు తెలియజేశారు. చెరువు నిర్మాణం మంచిగా ఏర్పాటు చేయాలని, ట్రాకింగ్ వాక్ నిర్మించి, చెట్లు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని సూచించా రు. గ్రామ పంచాయతీలో నుంచి నిధులతో, దాతల సహా యంతో సుందరంగా నిర్మిస్తామని తెలిపారు. భవిష్యత్తు కోసం నీటిని సంరక్షించే లక్ష్యంతో ఆజాద్ కా అత మహోత్సవం భాగంగా 2022, ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం రోజున మన ప్రభుత్వం మిషన్ అమృత సరోవర్ కార్యక్రమం ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది ఉపాధి కూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు మండలంలో గొట్టిపాటి పర్యటన

ప్రజాశక్తి-పంగులూరు

అద్దంకి శాసనసభ్యుడు గొట్టిపాటి రవికుమార్, గురువారం పంగులూరు మండలంలోని పలువురు వివాహాలకు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. మండలంలోని ఆరికట్లవారి పాలెం గ్రామానికి చెందిన గుమ్మడి వెంకటేశ్వరమ్మ, ఆంజనేయులు (లేటు) దంపతుల కుమారుడు గుమ్మడి బాజీ, వివాహం సందర్భంగా బాజీని ఆశీర్వదించి, వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పంగులూరు గ్రామంలోని రాయిని వీరనారాయణ, సుబ్బారావమ్మ దంపతుల కుమారుడు అశోక్, వివాహాన్ని పురస్కరించుకొని, ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ముప్పవరం గ్రామంలోని కుక్కపల్లి నరసింహారావు (లేటు), సుధారాణి దంపతుల కుమారుడు శ్రీకాంత్, వివాహ సందర్భంగా హాజరై శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని చందలూరు గ్రామానికి చెందిన అడ్డగడ్డ శ్రీనివాసులు, నాగరాజా దంపతుల కుమారుడు సాయికిరణ్‌కు, సంతమాగులూరు మండలం గురిజేపల్లి గ్రామానికి చెందిన చల్లా సాంబశివరావు, పద్మ దంపతుల కుమార్తె లక్ష్మీకి, బొప్పూడిలోని ప్రసన్నాంజనేయ స్వామి కళ్యాణ మండపంలో వివాహం జరుగుతున్న సందర్భంగా, వారి వివాహనికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో పంగులూరు మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వరుడికి ఎమ్మెల్యే ఆశీర్వాదం

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి మండలంలోని గోవాడ గ్రామ పంచాయతీ పరిధిలోని సాధునగర్ గ్రామానికి చెందిన గంటా నాగభూషణం (లేటు) సరస్వతి దంపతుల కుమారుని వివాహం సందర్భంగా శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ గురువారం హాజరై వరుడు నాగేంద్ర ప్రసాద్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని రామనగర్లో కామేపల్లి కళ్యాణ మండపంలో నాగులపాడు గ్రామానికి చెందిన జాగర్లమూడి వేణుబాబు, సౌజన్య దంపతుల కుమార్తె ఓణీల మహోత్సవ కార్యక్రమానికి హాజరై చిన్నారి అక్షరకు ఆశీస్సులు తెలిపారు. పట్టణంలోని విద్యానగర్లో కొటికలపూడి గ్రామ మాజీ సర్పంచ్ కంచర్ల వెంకట్రావు కుమార్తె అంజమ్మ, అల్లుడు చప్పిడి సుబ్బారావుల నూతన గృహ ప్రవేశం పురస్కరించుకొని సత్యనారాయణ స్వామి వ్రత మహోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని నాగులపాడు గ్రామంలో మంగమూరి హనుమంతరావు సోదరుని కుమారుని వివాహం సందర్భంగా హాజరై వరుడు శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. బల్లికురవ మండలం కొత్తూరు గ్రామ వాస్తవ్యులు పోలినేని ప్రసాదరావు, కుమారి దంపతుల కుమార్తె వివాహం పురస్కరించుకొని హాజరై వధువు నాగ శ్రావణిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. బల్లికురవ మండలం కొమ్మినేనివారిపాలెం గ్రామంలో కొమ్మినేని రమేష్‌బాబు నూతన గృహప్రవేశ వేడుకకు హాజరయ్యారు. అదే గ్రామానికి చెందిన వంకాయల రామాంజనేయులు కంటి శస్త్ర చికిత్స చేయించుకోగా వారిని పరామర్శించారు. యడవల్లి రమణ కుమారుడు గోపి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. యడవల్లి లక్ష్మయ్య ఇటీవల కాలం చేయగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



ఓ శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యే గొట్టిపాటి

బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో ఏటి ఏడుకొండలు, తిరుపతమ్మ దంపతుల కుమారుని వివాహం పురస్కరించుకొని హాజరై వరుడు పెద్ద గోపిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. జె పంగులూరు మండలం ఆరికట్లవారిపాలెం గ్రామ వాసి గుమ్మడి వెంకటేశ్వరమ్మ ఆంజనేయులు(లేటు) దంపతుల కుమారుని వివాహం సందర్భంగా వరుడు గుమ్మడి బాజీని ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జె పంగులూరు మండలం పంగులూరు గ్రామంలో రాయిని వీరనారాయణ, సుబ్బారావమ్మ దంపతుల కుమారుని వివాహం పురస్కరించుకొని హాజరై వరుడు అశోక్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. జె పంగులూరు మండలం ముప్పవరం గ్రామంలో కుక్కపల్లి నరసింహారావు(లేటు) శ్రీమతి సుధారాణి దంపతుల కుమారుని వివాహం సందర్భంగా హాజరై వరుడు శ్రీకాంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పంగులూరు మండలం చందలూరు గ్రామ వాసి అడ్డగడ్డ శ్రీనివాసులు నాగరాజ దంపతుల కుమారుడు, సంతమాగులూరు మండలం గురిజేపల్లి గ్రామ వాస్తవ్యులు చల్లా సాంబశివరావు పద్మ దంపతుల కుమార్తె వివాహం బొప్పూడిలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి కళ్యాణ మండపంలో జరుగగా ఈ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు లక్ష్మీ, సాయికిరణ్‌లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

ప్రజాశక్తి-అద్దంకి

విద్యార్థినీ విద్యార్థులు చిన్నప్పటి నుంచే గ్రంథాలయంలోని పుస్తకాలను పఠనం చేస్తూ మంచి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అద్దంకి ప్రెసిడెంట్ తాలూరి బాబూరావు అన్నారు. గురువారం శాఖా గ్రంథాలయం అద్దంకిలో వేసవి విజ్ఞాన శిబిరంలో 4వ రోజుకు చేరుకుంది. ఈ శిబిరంలో 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్ మరియు యోగా శిక్షణ తరగతులను బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అద్దంకి ప్రెసిడెంట్ తాళ్లూరి బాబూరావు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రంథ పాలకుడు సుగుణరావు పాల్గొన్నారు.

గుడి శంకుస్థాపనలో కృష్ణ చైతన్య

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలో గురువారం గ్రామస్తుల సహకారంతో నిర్మించనున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి గుడి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ శాప్ నెట్ ఛైర్మన్, వైసిపి అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు, ఏల్చూరు మాజీ సొసైటీ అధ్యక్షులు దుద్దేల గాలెయ్య, అట్లా పెద్ద వెంకటరెడ్డి, విప్పల మునలారెడ్డి, నక్కా వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌పిని కలిసిన సిఐ

ప్రజాశక్తి-సంతమాగులూరు: బాపట్ల సబ్ డివిజన్ నూతన డిఎస్పీగా నియమితులైన వెంకటేశులును సంతమాగులూరు సిఐ బి ప్రభాకర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఖరీఫ్ సాగుకు సమాయత్తంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

పిట్టలవానిపాలెం మండలంలోని మంతెనవారిపాలెం ఆర్‌బికెలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎంసీ ఓబయ్య మాట్లాడుతూ వేసవిలో లోతు దుక్కులు, మట్టి నమూనా పరీక్షలు రైతులు చేసుకునే విధంగా మరియు ఖరీఫ్‌లో వాడవలసిన విత్తనాల రకాలు, వాటి ఆవశ్యకత మరియు విత్తన శుద్ధి గురించి రైతులకు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం డిడిఏ ఎం విజయనిర్మల మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, వాటి ఆవశ్యకత, పిఎం కిసాన్ ఈ కేవైసీ, సమస్యాత్మక భూములు, వాటి యాజమాన్య పద్ధతులు, మరియు వ్యవసాయంలో యాంత్రీకరణ ప్రాముఖ్యత గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ క్రాప్ బుకింగ్ ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి, సిహెచ్ సుదర్శన్‌రావు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నేతలు

ఇల్లు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

- బీసీ సంఘాల నేతల డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

స్థానిక కొత్తపట్నం రోడ్డులో నల్లూరి నర్సింగ్ హోం ఎదురుగా నివాసం ఉంటున్న విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన నాగార్జున ఆచారి నివాసాన్ని కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా జెసిబితో కూల్చివేశారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని విశ్వబ్రాహ్మణ సంఘం కార్యదర్శి సుతారం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కొత్తపట్నం రోడ్డులోని బాధితుని నివాసం వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగార్జున ఆచారికి గత 40 ఏళ్ల నుంచి పూర్వీకులు తనకు ఇచ్చిన ఆస్తిని ఎవ్వరికి అమ్మకపోయినా కొంతమంది వ్యక్తులు నకిలీ ధృవత్రాలు సృష్టించి ఆస్థలాన్ని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నట్లు తెలిపారు. గతంలో రెండు సార్లు దాడి చేశారని వివరించారు. రెండు రోజుల కిందట బలవంతంగా ఇంటిని కూల్చివేశారని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విషయం ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన బాధితులకు అండగా ఉండాలని జిల్లా పోలీసు అధికారులకు సూచించినట్లు తెలిపారు. బాధితులు మాట్లాడుతూ పోలీసులు జోక్యం చేసుకొని తమకు రక్షణ కల్పించాలన్నారు. తమ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. తమపై రెండు సార్లు దాడులకు పాల్పడిన శింగరాజు రాంబాబు అనుచరులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. బాధితులకు మద్దతు తెలిపిన వారిలో వడ్డెర సంఘం నాయకులు ఆంజనేయులు, తన్నీరు నాగేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రజిని, నాయీ బ్రాహ్మణ సంఘం డైరెక్టర్ లక్ష్మీనారాయణ, మద్దులూరి శ్రీనివాసరావు, మారెళ్ల శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు ఉన్నారు.

సబ్ ప్లాన్‌ను చిత్తశుద్ధితో అమలు చేయాలి

దళిత. గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ అల్లడి దేవకుమార్



మాట్లాడుతున్న అల్లడి దేవకుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలులో పాలకులకు పారదర్శకత అవసరమని, సబ్ ప్లాన్‌ను పాలకులు చిత్తశుద్ధితో అమలు చేయాలని దళిత గిరిజన బడ్జెట్ వాచ్ రాష్ట్ర కన్వీనర్ కన్వీనర్ అల్లడి దేవకుమార్ తెలియజేశారు. ఒంగోలు ప్రెస్ క్లబ్‌లో గురువారం జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కమిటీ ఆధ్వర్యంలో విస్తత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా దళిత గిరిజన బడ్జెట్ వాచ్ కన్వీనర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో పి.పేరయ్య మాట్లాడుతూ మూడు దశాబ్దాల స్వాతంత్ర్య భారతంలో ప్రభుత్వాలు చేపట్టిన పేదరిక నిర్మూల పథకాలు ఎస్‌సి, ఎస్‌టిలు, ఇతర కులాల మధ్య ఉన్న సామాజిక ఆర్థిక అసమానతులను,తొలగించుటలో ఆశించిన స్థాయిలో మార్పు లు తీసుకు రాలేకపోయాయన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కరవది సుబ్బారావు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పంచవర్ష ప్రణాళికలో అంతర్భాగమేనని, ఈ నిధులను వేరే పనులకు మళ్లించ కూడదన్నారు. వీటిని మిగిలించకూడదని తప్పనిసరిగా ఖర్చు చేయాలన్నారు. కుల వివక్ష పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురామ్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ 2013లో పదేళ్ళ కాల పరిమితి తో అమలు చేశారన్నారు.. 2023 తో ముగుస్తున్న ఈ చట్ట కాలపరిమితిని 10 పొడిగిస్తూ నేటి ప్రభుత్వం నిధులు లేని చట్టాన్ని పేద ప్రజలకు అందించినట్లు చూపటం బూటకమన్నారు. జై భీమ్ పాంథర్స్ జిల్లా అధ్యక్షుడు పాలడుగు రమేష్ మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి కార్పొరేషన్లలో నిధులు లేని తీరు నిరుపేద దళిత గిరిజనులను అగాధంలోకి నెట్టి వేసిన పరిస్థితి దాపురించిందన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి బిల్లా శరత్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ పనితీరుతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంఘటిత పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు బాలసుందరం, ప్రజా సంఘాల నాయకులు పాలెపోగు డగ్లస్, తాళ్లూరు కోటేశ్వరరావు, శాంతరాజ్, అంబేద్కరిస్ట్ డిపిఆర్ ప్రసాద్, చప్పిడి కోటేశ్వరరావు, డాక్టర్ రమణ మూర్తి, పులిపాటి వీరయ్య, గోపన బోయిన వెంకట్రావు, గుత్తి కోటేశ్వరరావు, పాటిబండ్ల జాన్ బాబు,గుంటూరు నాగమణి, విశ్రాంత ఉద్యోగస్తులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో భవితకు బాటలు

వేసవి సెలవుల సద్వినియోగంతో మేలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సమయం విలువైనది. నిమిషం వథా చేసినా తిరిగి రాదు. ప్రతి విద్యార్థికి ప్రతి క్షణం ఎంతో ముఖ్యమైనది. వేసవి సెలవులు సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలు పెంపొం దించుకుంటే బంగారు భవితకు బాటలు వేసుకోవచ్చు. ఉన్నత చదువుల్లోనూ రాణించవచ్చు. ఆ దిశగా విద్యార్థులు ఆలోచించాల్సిన అవసర ముంది. విద్యార్థి జీవితానికి పదో తరగతి మలుపు లాంటిది. మంచి మార్కుల సాధన కోసం శ్రమించారు. ఒత్తిడి ఎదుర్కొన్నారు.



ప్రస్తుతం విరామం లభించింది. ఈ సమయంలో నైపుణ్యాలు పెంచుకుంటూ భవిష్యత్తు ప్రణాళికపై దష్టి పెట్టాల్సి ఉంది.

నేర్చుకోదగ్గ అంశాలు

సాంకేతిక అభివద్ధి ఎంతో అవసరం. ఇందుకోసం కంప్యూటర్ పరిజ్ఞానం పెంచుకోవాల్సి ఉంది. కంప్యూటర్ అంశాల్లో శిక్షణ తీసుకోవచ్చు. పాలిటెక్నిక్, ఏపీఆర్ జేసీ తదితర పరీక్షలు రాసేందుకు తర్ఫీదు పొందవచ్చు. ఆంగ్లంలో వెనకబడిన వారు స్పోకెన్ ఇంగ్లీషు తరగతులకు వెళితే పట్టు సాధిం చవచ్చు.చదువులో వెనకబడిన విద్యార్థులు వత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ తీసుకుంటే ఉపాధికి బాటలు పడతాయి. విద్యార్థినులు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, ప్యాషన్ డిజైన్లు వంటివి నేర్చుకోవచ్చు. నిరుపయోగ వస్తువులతో కళాకృతులు తయారీ వంటి వాటిలో శిక్షణ పొందవచ్చు. చేతిరాతను మెరుగు పరచుకోవచ్చు. క్రీడల్లో రాణించే వారు ఆటకు పదును పెట్టుకోవచ్చు. కూ చిపూడి, భరతనాట్యం వంటివి నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీషు నేర్చుకుంటా

పఠాన్ సఫియుల్లా ఖాన్,



వేసవి సెలవులు సద్వినియోగం చేస ుకుని భవిష్యత్తుకు బాటలు వేసు కుంటా. మంచి మార్కులు వస్తా యని భావిస్తున్నా. సమయాన్ని వథా చేయకుండా మున్ముందు చదువులకు ఉపయోగపడే అంశాల్లో తర్ఫీదు పొందుతా. స్పోకెన్ ఇంగ్లీషుకు వెళ్లాలను కుంటున్నా. ఇంజినీరు కావాలన్నదే లక్ష్యం. అందుకు అనుగుణంగా శిక్షణ తీసుకుంటా. కొంత సమయం విహార యాత్రలకు కేటాయిస్తా.

పోటీ పరీక్షల పుస్తకాలు చదువుతా

షేక్ కరిష్మా షాజిద బేగం, యర్రగొండపాలెం



వేసవి సెలవులు సది ్వనియోగం చేసు కుంటా. భవిష్యత్తుకు ఉ ప యో గ ప డే అంశాలపై దష్టిపెడతా. పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు చదువుతా. తెలియని విషయాలు తెలుసుకుని పరిజ్ఞానం పెంపొందిం చుకుంటా. ఉన్నత చదువుల్లో రాణించేలా వేసవి సెలవుల్లో సిద్ధమవుతా.

కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకుంటా

ముటుకూరి జెస్సీ, యర్రగొండపాలెం



పదో తరగతితో మంచి మార్కులు వచ్చాయి. వేసవి సెలవుల్లో బ్రిడ్జి కోర్సుకు వెళ్లాలని ఉంది. కంప్యూటర్ నేర్చుకుంటా. ఆంగ్లంపై పట్టు సాధించేందుకు స్పోకెన్ ఇంగ్లీషు తరగతులకు వెళతా. భవిష్యత్తుకు ఉప యోగపడే మరికొన్ని అంశాలపై దష్టిపెడతా.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి

కమిషనర్‌ను కోరిన బృందావన్ నగర్ వాసులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

తమ ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని బృందావన్ నగర్ వాసులు నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య పనులు పర్యవేక్షణలో భాగంగా కమిషన్ బృందావన్ నగర్ సచివాలయం పరిధిలో గురువారం పర్యటించారు. ఈసందర్భంగా ఆప్రాంత ప్రజలు వీధి కుక్కల వల్ల వాళ్లు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ పెటా చట్టం ప్రకారం కుక్కలను బంధించి తీసుకు వెళ్లి, వాటికి యాంటీ రేబీస్ వ్యాక్సిన్ ఇప్పించి, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించి తిరిగి పట్టుకున్న చోటే వదిలేస్తారని తెలిపారు. దీనివల్ల కుక్కలు కరిసినా మనుషులకు ప్రమాదం ఉండదని చెప్పారు. బృందావన్ నగర్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన కమిషనర్ అక్కడ చెత్త సేకరణ పనులను పరిశీలించారు. మూడు బుట్టల విధానం ద్వారా ప్రజల నుంచి చెత్తను సేకరించాలని సిబ్బందికి సూచించారు. మూడు బుట్టల విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. యూజర్ చార్జీల వసూళ్ల గురించి నోడల్ ఆఫీసర్‌కు పలు ఆదేశాలు ఇచ్చారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జీ, సచివాలయ, శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

సచివాలయాల్లో పరిశీలన

నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు నగరంలోని ఇస్లాంపేట, బొల్లినేని వారి పాలెం సచివాలయను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టిని తనిఖీ చేశారు. సిబ్బంది అంతా ఏకరూప దుస్తులు ధరించాలని సూచించారు. విధులకు సకాలంలో హాజరు కాని సిబ్బందికి షోకాజు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. ఇస్లాంపేటలో పెండింగ్‌లో ఉన్న పింఛను ఆప్లికేషన్లను తరితగతిన విచారించి తన లాగిన్‌కు పంపాలని సూచించారు. యూజర్ ఛార్జీల వసూలు గురించి సచివాలయ సిబ్బందితో చర్చించారు.